# నేల విడిచిన సాము

నట్టింట్లో చొట్టబోయిన బిందెను దభీమని పడేసి కాలు పట్టుకొని కూలబడింది కాంతమ్మ.

"నాకు చావు రాకుండా వుంది భగవంతుడా!" రాగం తీసింది కాంతమ్మ.

అంతవరకూ ముసుగు తన్నిపట్టి నిద్రా మెళుకువా మధ్యలో అటూ ఇటూ అవుతూ ముసుగులోనే కదిలాడు సత్యనారాయణ అశాంతిగా. కాని లేవబుద్ధి పుట్టలేదు. మళ్ళీ ముసుగులోనే మూడంకెవేసి నిద్రపోవటానికి ప్రయత్నించసాగాడు.

"ఆడంగి వెధవ! పెళ్ళాన్ని వెనకేసుకొస్తాడు. వాడి సిగ్గు చిమడ! ఆ పెళ్ళాం బతుకు ఎవరెరగందో?" అంటూ పంచాంగం విప్పింది కాంతమ్మ. ఆ గొంతులో కసీ, ఏడుపూ నేను ముందంటే నేను ముందని కొట్లాడుకుంటున్నాయి.

ఆ దెబ్బతో సత్యనారాయణ నిద్రమత్తుకాస్తా వదిలి పోయింది. ఇంకా అలాగే పడుకుంటే ఆ గాలి విసురు తనవైపుకే తిరుగుతుందని తెలుసు. కాని వెధవ బద్ధకం. లేవబుద్ధి కాందే!

పనిమనిషి వచ్చినట్లు లేదు. కొందరు గుమాస్తాల్లాగ ఈ పనిమనుషులకూ తెలుసు ఎప్పుడు పని ఎగగొడితే తమ ఉనికియొక్క ప్రాధాన్యత తెలిసివస్తుందనే విషయం.

పంపు దగ్గర ఏదో చిన్నపాటి యుద్ధమే జరిగినట్లుంది. అదేం అన్యాయమో! ఈ కాలనీ కట్టి దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నా ఇళ్ళలో పంపులు వెయ్యాలనే విషయంమీద ఇంతవరకూ ప్రభుత్వం ఏ చర్యా తీసుకున్నట్లు కనిపించదు.

"మా ఇంట్లోనూ వున్నారు మగాళ్ళు వుండటానికి! ఏం లాభం! ఎనిమిది గంటలయినా ముసుగుతీసే పని లేదు."

ఆలోచిస్తున్న సత్యనారాయణకు ముసుగులోనే కొరడాదెబ్బ తగిలినట్లయి ఒగ్గున లేచి కూర్చున్నాడు మంచంమీద.

"ఏమిటి కాంతం! ఏం జరిగింది?" అన్నాడు సత్యనారాయణ కాంతమ్మ ముఖంలోకి చూడకుండానే.

"ఇంకా ఏం జరగాలి? ఆ రామారావు పెళ్ళాం నన్ను తోసేసింది. బిళ్ళబీటుగా బిందేసుకుని పడిపోయాను.

పైగా దాని మొగుడు....ఆడారి వెధవ....పెళ్ళాన్ని వెనకేసుకొని పోట్లాటకు వచ్చాడు" అంది కాంతమ్మ బెణికిన పాదాన్ని సవరించుకుంటూ.

"పోనీలే కాంతం! ఈ భాగ్యానికి కొట్లాటలదాకా ఎందుకు నీళ్లు నేను తెస్తాలే" అన్నాడు అంతకంటే ఎలా ఓదార్చాలో అర్థంకాని సత్యనారాయణ. అనటం అన్నాడే కాని నీళ్ళు తేవటం అంత తేలిక పనికాదని తెలిసిన సత్యనారాయణకు ఏదోగా అనిపించింది.

కాంతమ్మ రుసరుసలాడుతూ లోపలకు వెళ్ళిపోయింది. తన భర్త అతి మంచితనం చూస్తుంటే కాంతమ్మకు ఒకోసారి ఒళ్ళు మండిపోతుంది.

ఆ చొట్టబోయిన బిందెను చేత్తో తీసుకొని నీళ్ళకు బయలుదేరాడు సత్యనారాయణ. వరండాలో అడుగు పెట్టాడో లేదో దూరంనుంచి అరుపులు వినిపించాయి. పంపు చుట్టూ చిన్నా పెద్దా, ఆడా మగా, గోలగోలగా అరుస్తూ కనిపించారు సత్యనారాయణకు.

సత్యనారాయణ ఒక అడుగు ముందుకు వేశాడో లేదో, పక్కింటి కమల, ఆమె వెనకే ఆమె పెద్దకూతురు పదేళ్ళది మోయలేని బిందెతో వస్తూ కనిపించారు. వాళ్ళ వాలకం చూస్తే పంపుదగ్గర ఆవిడా ఓ చిన్నపాటి యుద్ధమే చేసి వస్తున్నట్లు కనిపించింది. తలంతా రేగి వుంది. చీర

సగం పైగా తడిసిపోయి వుంది. రవిక కుడిచేతిమీదుగా చిరిగి వుంది. వోరూ, పిక్కబలం గలవారికే వీధి పంపు నీళ్ళు అనుకున్నాడు సత్యనారాయణ.

కాలేజీలో చదివే రోజుల్లో ఏ పెద్ద ఆఫీసర్నో అవుతానని కలలుకన్న సత్యనారాయణ, ఎం.ఏ., (లిట్). చేతిలో బిందె పట్టుకొని వీధి పంపు నీళ్ళకోసం బిక్కు బిక్కు మంటూ నిల్చున్నాడు.

కుళాయి చుట్టూ జనం మూగి వున్నారు. అందులో ఆడవాళ్ళ సంఖ్యే ఎక్కువ. కదిలించిన తేనెపట్టు చుట్టూ ఝుంమ్మంటూ ముసిరే తేనెటీగలు గుర్తుకొచ్చాయి. కాని ఒక తేనెపట్టుకు ఒకే రాణి ఈగ వుంటుంది. కాని ఇక్కడ.... తన ఆలోచనకు తనే నవ్వుకున్నాడు సత్యం.

ఇలా ఆలోచిస్తూ నిల్చుంటే లాభం లేదని సత్యనారాయణ పంపుకేసి రెండు అడుగులు ముందుకువేసి మళ్ళీ ఆగిపోయాడు. అంతకుముందే జరిగిన సంఘటనల గురించి కొందరు ఆడవాళ్ళు చర్చించుకుంటున్నారు. మరికొందరు నేను ముందంటే నేను ముందని గొడవ పడుతున్నారు. దూరంగా బిందె చేత్తో పట్టుకొని నిల్చున్న సత్యనారాయణ 'క్యూ' ఏర్పాటుచేస్తే బావుణ్ణు అనుకున్నాడు. 'క్యూ' లేకపోతే తనలాటివాళ్ళకు ఓ చెంబెడు నీళ్ళుకూడా దొరికే ఆస్కారం కనిపించటంలేదు.

" అయినా ఆడవాళ్ళ తగాదాల్లో మగవారు కల్పగ జేసుకోవటం అంత బుద్ధితక్కువ పని మరొకటి లేదు " అంది ఓ మధ్యవయసు పునిస్త్రీ.

' లేకపోతే ఆ కాంతమ్మతల్లి కనకాన్ని గెలవనిస్తుందా ? ' సాగదీసింది ఓ ప్రౌఢ.

" అదీ నిజమేనే. ఆ సత్యనారాయణ పెళ్ళానికి ఏం చూసుకొనో అంత ఇరగబాటు ! మొగుడు ఎం.ఏ. అట, పుట్టింటివారికి బాగా డబ్బుండటగా ? " సంతృప్తిలేని కాపరంతో సతమతమవుతున్న ఓ యువతి రాగం తీసింది.

" ఆఁ ! ఏం ఎం ఏలే ! చేసేది గుమాస్తాగిరేగా ? పుట్టింట్లో వుందో లేదో ఎవరికి తెలుసు. ఇక్కడ మింగటానికే లేదుగా ! " మూతి తిప్పింది మెడ తిరగని నగలతోవున్న ఓ యువతి.

మొదటి స్త్రీ మూడో ఆవిణ్ణి గిచ్చి మాట్లాడవద్దని అంతవరకూ వారి సంభాషణను వింటున్న సత్యనారాయణను సైగతో చూపించటం అతను గమనించక పోలేదు.

ఆ కుళాయి చుట్టూ పాతిక ముప్పయ్ ఖాళీ బిందెలు అడ్డ దిడ్డంగా పడి వున్నాయి. మానవ విలువల్ని వెక్కిరిస్తున్నట్లు నీళ్ళ ధార సన్నగా నల్లగా బీదవాని శరీరంమీద గుడ్డ పీలికలా కారుతోంది. చుట్టూవున్న ఖాళీ

బిందెల ఆకాశంకేసి నోళ్ళు తెరుచుకొని దీనంగా చూస్తున్నట్లనిపించింది సత్యనారాయణకు.

"ఏవమ్మోయ్! బిందె నిండింది. తియ్!" ఓ లావాటి ఆవిడ అరుస్తూ, అడ్డంగావున్న వాళ్ళను తోసుకుంటూ ముందు కొచ్చింది. ఆమె జబర్దస్తీకి సత్యనారాయణ విస్తుపోయాడు.

'ఏవిటమ్మోయ్! ముందొచ్చిన వాళ్ళను వెనక్కు తోస్తున్నావ్. నడు నడు!' అంటూ ఒక పనిమనిషి ఆ లావుపాటి ఆవిణ్ణి వెనక్కు తోసింది. దాంతో ఇద్దరి చేతులు కలిశాయి. కంఠాలు ఆకాశంకేసి విజృంభిస్తున్నాయి. మళ్ళీ పంపు చుట్టూ కేకలూ, అరుపులూ.

సత్యనారాయణకు అక్కడ నిల్చే బుద్ధి కాలేదు. ఖాళీ బిందెతో కాళ్ళీడ్చుకుంటూ కదిలాడు ఉసూరుమంటూ.

'చూడవే కాంతమ్మ మొగుడు ఖాళీ బిందెతోనే వెళ్ళిపోతున్నాడు.' కిలకిల నవ్వు.

'ఇంట్లో వాళ్ళావిడకోసం సొంతంగా పంపు వేయిస్తాడేమోనే.'

గొల్లున నవ్వులు. సత్యనారాయణకు కోపం వచ్చింది కాని అతను ఆడవాళ్ళతో కలుగజేసుకొనేంత కుసంస్కారి కాదు. అవమానంతో గబగబా ముందుకు నడిచాడు.

సత్యనారాయణ ముఖం చూసిన కాంతమ్మకు అంతా అర్థం అయింది. భర్తమీద జాలి పొంగి పొర్లింది. మారు మాట్లాడకుండా భర్త చేతిలోని బిందెను అందుకొని బయలు దేరింది. ఆమెను వెళ్ళకుండా ఆపాలనుకున్నాడు కాని ఎలా ? ఇంట్లో కళ్ళద్దుకోవటానికైనా నీటిబొట్టు లేదాయె ! ఏం పట్నవాసమో ! ఏం నాగరిక జీవితమో ! చెంబు నీళ్ళకోసం నానా మాటలూ అగచాట్లూను !

పంపు దగ్గర మళ్ళీ ఏదో రగడ జరిగినట్లుంది. ఈసారి ఆడవాళ్ళ ఏడుపులూ, మగవాళ్ళ కేకలూ వినిపిస్తున్నాయి.

సత్యనారాయణ నిట్టూర్చాడు. కాలనీలో వుండే వాళ్ళంతా కాస్తో కూస్తో చదువుకొని ఉద్యోగాలు చేసేవాళ్ళూ, వాళ్ళ తాలూకు కుటుంబాలే. అయితేనేం ? స్వల్పమైన జీవితావసరాలు కూడా మానవుల్ని మానవత్వంనుంచి కిందకు తోసేస్తాయేమో !

అప్పటికే ఉదయం ఎనిమిది దాటింది. ఇంతవరకు కాఫీ నీళ్ళయినా గొంతులో పోసుకోలేదు. తల పగిలి పోతోంది, సత్యనారాయణకు. భార్య నీళ్ళ బిందెతో ప్రవేశించటం చూశాడు. జుట్టు చెదిరిపోయి, చీర తడిసిపోయి, అలసటతో నీళ్ళ బిందెను ఎత్తుకొని లోపలకు వచ్చిన కాంతమ్మను పలకరించే ధైర్యం లేకపోయింది, సత్యనారాయణకు.

ఎంతకూ కాఫీగ్లాసు వచ్చే సూచనలు కనిపించక లేచి వంటింటివైపు నడిచాడు సత్యం. అక్కడ శ్రీమతి కనిపించకపోగా పొయ్యి కూడా రాజేసి లేదు. శ్రీమతిమీద చిర్రెత్తుకొచ్చింది. కాని ఏం చేస్తాడు ? నెల చివర్లో పొయ్యిమీదకూ పొయ్యిలోకి ఏమేమి లేవని దండకం చదువుతుందోనని భయపడ్డాడు. కాంతం ఏ కాఫీ పొడరు అరువు కోసమో పక్కింటికి వెళ్ళివుంటుందనుకున్నాడు. కాని అంతలోనే అంట్లగిన్నెలు పట్టుకొని దొడ్డివైపుకు వెళుతున్న కాంతాన్ని చూసి గతుక్కుమన్నాడు. ఆమె వైఖరి చూస్తే మరో గంట కయినా కాఫీనీళ్ళు ఇచ్చేలా కనిపించలేదు సత్యానికి.

"ఏమిటి కాంతం నువ్వు అంట్లగిన్నెలు తోముతున్నావు ? పనిమనిషి రాలేదా ?" నాలుక కరచుకున్నాడు. పనిమనిషి రాలేదని పొద్దుటనుంచీ తెలుస్తూనే వుందిగా ! ఏమిటో ? అర్థంలేని ప్రశ్నలు వేస్తుంటారు కొన్నిసార్లు అనుకున్నాడు సత్యనారాయణ.

'మానేసింది !' కాంతమ్మ ఇచ్చిన ఆ ముక్తసరి జవాబు 'నా బతుక్కి ఓ పనిమనిషి కూడానా ?" అన్నట్లుగా వున్నది ఆమె ధోరణి.

"మానేసిందా ? ఏం ?" ఆశ్చర్యంగా అడిగాడు సత్యనారాయణ.

భర్త ఆశ్చర్యం చూసిన కాంతమ్మకు బోలెడంత ఆశ్చర్యం వేసింది. ' ఈ మనిషికి జీవితం ఎప్పటికి అర్థం అవుతుందో ? ' మనస్సులోనే అనుకుంది.

' దానికి జీతం పెంచాలట. అంత తాహతు మన కెక్కడ వుంది ? అడిగినప్పుడల్లా జీతాలు పెంచటానికి ? అదేమంటే " మీకు మాత్రం పెరగలేదా ? ధరలు చూస్తుంటే ఆకాశాన్ని అంటుతున్నాయి. మా పొట్టలు మాత్రం నిండొద్దూ? అంటుంది. మీకు అయిదు రూపాయలు జీతం పెంచగానె మార్కెట్‌లో ధరలు పదిహేను రూపాయ లకు పెరుగుతాయి. అసలు ఆ జీతాలు పెంచకుండా వున్నా బాగుండును " గొణుగుకుంటూ చేతిలో అంట్లగిన్నెలతో దొడ్లోకి నడిచింది కాంతమ్మ.

ఆమె వెనకనే రెండడుగులు వేసి " ముందు కాఫీ కాయకూడదా కాంతం ! " అన్నాడు బతిమాలుతున్న స్వరంతో.

కాంతమ్మ భర్త ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది. భార్యకు అంత ఆశ్చర్యం ఎందుకు కలిగిందో అర్థంకాని సత్యం అయోమయంగా చూశాడు భార్య ముఖంలోకి.

' పాలవాళ్లు ఈరోజునుంచి స్ట్రయిక్ చేస్తున్నారని తెలియదూ ? ' అంటూ దొడ్లోకి వెళ్ళిపోయింది కాంతమ్మ.

సత్యం ఉలిక్కిపడ్డాడు. అవును తనూ విన్నాడు పాల ధర పెంచమని పాలవాళ్ళు స్ట్రయిక్ చేస్తారని. కాని ఆ శుభదినం ఇంత త్వరగానే వస్తుందని తను అనుకోలేదు. ఆ చేసేవాళ్ళు నెల మొదటి వారంలో చెయ్యకూడదూ ? అలా ఎందుకు చేస్తారు ? వాళ్ళ ఉద్దేశం తమలాటివారిని ఇబ్బంది పెట్టాలనేగా ! అదేం మాటలే ! పాపం వాళ్లు మాత్రం చస్తారా ఏం ? గేదెకు వేసే ఎండుగడ్డి ధర కూడా మండిపోతూందాయె !

ఆలోచిస్తున్న సత్యనారాయణ చేతికి ఫ్లాస్కు అందించింది కాంతమ్మ. మారుమాట్లాడకుండా ఫ్లాస్కు అందుకొని బయలుదేరాడు సత్యనారాయణ.

హోటల్లో తనో కప్పు కాఫీ తాగి, ఇంకో కప్పు భార్యకోసం ఫ్లాస్కులో పోయించుకొని ఇంటికి వచ్చిన సత్యనారాయణ చేతికి బజారునుంచి ఆరోజు తేవలసిన వస్తువులు రాసిన పద్దు కాగితం అందించింది కాంతమ్మ. ' చచ్చానురా భగవంతుడా ! ' అనుకున్నాడు సత్యం.

" ఇవన్నీ రేపు తేకూడదా కాంతం ! ఇప్పుడు వెళ్ళి ఆ క్యూలో నిల్చుంటే ఎంతసేపు అవుతుందో ఏమో ! ఆఫీసులో ఇవ్వాళ చాలా ముఖ్యమైన పని కూడా వుంది. పైగా మా ఆఫీసరు ఇవ్వాళ కొంచెం త్వరగా రమ్మని కూడా చెప్పాడు " అన్నాడు సత్యనారాయణ అపరాధిలాగ.

కాంతమ్మ కనుబొమలు ముడిపడ్డాయి. ఉబికివస్తున్న కోపాన్నీ, దుఃఖాన్నీ గొంతుకలోనే దిగమింగుకుంది.

"మీ ఆఫీసరు ముందుగా రమ్మని చెప్పంది ఎప్పుడు? రాత్రినుంచి ఇంట్లో బియ్యం లేవు. కొద్దిగా వుంటే మీకూ పిల్లవాడికీ పెట్టాను" అంటూ కాంతమ్మ ముఖం పక్కకు తిప్పుకుంది.

సత్యం కొయ్యబారిపోయాడు. భార్య ముఖంలోకి చూశాడు. లోతుగా పీక్కుపోయిన కళ్ళలోని నీరు తను చూడకుండావుండే ప్రయత్నంలో వుంది. మారు మాట్లాడకుండా భార్య చేతిలోని సంచి అందుకొని రెండు అంగల్లో రోడ్డు ఎక్కాడు. జేబులు తడుముకుని చూసుకున్నాడు. చేతికి రెండు రూపాయల నోట్లూ కొంత చిల్లరా తగిలింది. కనీసం బియ్యం, కందిపప్పూ కొనవచ్చు అనుకున్నాడు.

రోడ్డుమీదకు వచ్చిన సత్యం పంపుకేసి చూశాడు. 144 సెక్షన్ పెట్టినట్లు ఎక్కడి వాళ్ళక్కడ వెళ్ళిపోతున్నారు. ఒక్కొక్కరూ నాలుగైదు ఖాళీ బిందెలతో కాళ్ళీడ్చుకుంటూ ఇంటి మొహాలు పట్టారు. నీటి కొళాయిలో నీటికి బదులుగా గాలి వస్తుంది. అప్పటిదాకా ఆజన్మ శత్రువుల్లా — కొట్లాడుకున్నవాళ్ళు అంతలోనే ఆప్తబంధువుల్లా "అప్పుడే నీళ్ళు ఆగిపోయినై" — అనే విషయాన్ని చర్చించుకుంటూ పోతున్నారు.

దుకాణం అల్లంత దూరం వుండగానే పెద్ద క్యూ కనిపించింది సత్యనారాయణకు. ఎక్కడ చూసినా ఈ క్యూ ఒకటి! బస్ ఎక్కాలంటే క్యూ, సినిమా చూడాలంటే క్యూ, బియ్యం కొనాలంటే క్యూ, ఆఖరకు దీపం వెలిగించుకొనే నూనెకోసం కూడా గంటలకొద్దీ క్యూలో నిలబడాలి. ఈ క్యూ లన్నీ ఒక ఎత్తు, దేవుణ్ణి చూట్టానికి నిఃబడే క్యూ ఒకటీ ఒక ఎత్తు. ఈనాటి మానవుడు జీవిస్తున్నది కలియుగమో కాదో చెప్పలేం కాని 'క్యూ యుగం' అని మాత్రం ఢంకా బజాయించి చెప్పగలం.

సత్యనారాయణ ఆలోచిస్తూ వెళ్ళి క్యూలో నిలబడ్డాడు. దుకాణం కనీసం ఒ వంద గజాల దూరంలోనైనా వుండి వుంటుంది.

"ఫెయిర్ ప్రైస్ షాపు" కొట్టొచ్చినట్టుగా పెద్ద బోర్డు. సంచి చేతులో పట్టుకొని ఎండలో నిల్చున్నాడు సత్యనారాయణ.

మెరుస్తున్న బోర్డును చూస్తూ అక్కడనుంచి తన వరకూ ఎంతమంది వున్నారో అని వంగి వంగి చూస్తూ నిలబడ్డాడు సత్యనారాయణ.

క్యూలో తన వరకూ రావటానికి ఎంత టైం పడుతుంది? క్యూలో నలభై ఏభయ్‌మంది వరకూ

వుండొచ్చు. ఒక్కొక్కడికి ఐదు నిమిషాలు పడుతుందా ? కాని తనొచ్చి పది నిమిషాలయినా ఇంతవరకూ ఒక్కడు కూడా వెళ్ళటం కనిపించలేదే ? ఆ లెక్క ప్రకారం కనీసం ఎంత కాదన్నా మనిషికి పది నిమిషాలయినా పట్టొచ్చు. అయితే ఏభై పదినిమిషాలు ! ఐదువందల నిముషాలు ! అంటే ఎన్ని గంటలూ ! చిన్నప్పుడు చదువుకున్న ఎక్కాల పుస్తకం సత్యనారాయణ బుర్రలో గిర్రున తిరిగింది. అన్ని గంటలే ! గుండెకాయ గొంతులోకి ఎగబాకినట్లయింది. అబ్బే అంతసేపు ఎందుకు పడుతుందీ ! నిమిషానికి ఒకళ్ళకి చొప్పున బియ్యం ఇచ్చేయవచ్చును.

అలా అయితే ఒక గంటలో తనకు చాన్సు రావచ్చు. తనకు తనే సర్ది చెప్పుకున్నాడు. రోహిణీకార్తె ఎండ నెత్తి మాడుస్తోంది. ముందున్న క్యూ చిన్నప్పుడు నాయనమ్మ వేసిన ముంతలో డబ్బుల్లా అలాగే వుంటే, వెనకవున్న క్యూ మార్వాడివాడి చక్రవడ్డీలా, రోజు రోజుకూ పెరుగుతున్న ధరల్లా, పెరిగిపోతోంది.

ముఖానికి పట్టిన చెమట తుడుచుకొని తనముందు నిల్చొనివున్న మనిషి ముఖంలోకి చూశాడు సత్యనారాయణ. వెనకనుంచి చూస్తే వయస్సుమళ్ళినవాడిలా వున్నా, అతడి ముఖం చూస్తుంటే అంత వయస్సు వున్నట్లనిపించటంలేదు.

" మనకు ఈ పూట బియ్యం దొరికినట్టేనా ? " నసిగాడు సత్యం క్యూను ఉద్దేశించి మాట్లాడుతున్నట్లు.

'ఆ రాస్కెల్ మనిషికి అరగంట తీసుకుంటున్నాడు, వాడిచ్చే అయిదు కిలోల బియ్యానికి!' అన్నాడు ముందున్నాయన.

'వాడి సొమ్మేం పోయింది? ఎండలో మాడి చచ్చేది మనమే గా?' మాట కలిపాడు సత్యం.

'వీళ్ళదంతా ఓ తంతు! తెల్లవారుఝామునుంచి కొట్లముందు క్యూ నిలబెట్టిచ్చి మొత్తం మీద ఏ ఇరవై మందికో ఇచ్చి రెండువందలమందికి ఇచ్చినట్లు లెక్కల్లో రాసుకుని మిగతావి బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు,' కసిగా అన్నాడు ముందున్నాయన.

"అలా కూడా జరుగుతుందంటారా?"

"అసలు జరుగుతూందే అది. నిన్న సాయంకాలం మూడు గంటల్నుంచి క్యూలో నిలబడి ఏడు గంటలకు వట్టి చేతుల్తో ఇంటికి పోయాను."

'అయితే యీ పూట మనకు బియ్యం దొరకవంటారా?' సత్యం గొంతులో ఆందోళన వ్యక్తమయింది.

ఆ మాటకు ముందున్నాయన సమాధానం చెప్పలేదు. బియ్యం దొరకవేమో అన్న అతని అనుమానాన్ని, బియ్యం తీసుకు వెళ్ళవలసిన అవసరం వెనక్కి నెట్టేసింది.

'నిన్న నాలుగు గంటలు నిల్చున్నా దొరక లేదన్నారు. ఇప్పుడు ఇంకా మన ముందు అంత క్యూ వుంది. దొరుకుతై అంటారా?' రెట్టించాడు సత్యం.

'ఈ పూట నాకు బియ్యం ఇవ్వకుండా షాపుమూస్తే వాడి డొక్క చీల్చేస్తాను.' పళ్ళు బిగించి ఉద్రేకంగా అన్నాడు ముందున్నాయన.

షాపులో బియ్యం ఇస్తున్నవాడు దూరంగా కనిపిస్తున్నాడు. మనిషి కొవ్వెక్కి కండలు తిరిగి వున్నాడు- వాడి బరువులో సగంలేని యీ బక్కాయన వాడి డొక్క చీరేస్తానంటున్నాడు. సత్యం తనలో తనే నవ్వుకున్నాడు- డొక్క చీరెయ్యటానికి శరీర బలానికి ఏదో యీక్వేషన్ వున్నట్టు.

నిముషాలు గడిచి గంటలవుతున్నాయి. తన భార్య ఆరోగ్యంలా తన ముందున్న క్యూ జరుగుతుంది. ధనవంతుడి బొజ్జలా వెనక క్యూ పెరుగుతోంది. సూర్యుడు మెడలమీదనుంచి నడినెత్తికి పాకుతున్నాడు. ప్రొద్దున్నే తాగిన కాఫీలోని నీళ్ళు ఎండకు ఎండి ఆవిరైపోయినై. నరాలకు పట్టిన కాఫీ తాలూకు శక్తి పట్టు వదిలేస్తోంది. డొక్కలో బ్రహ్మాండమంత ఖాళీ ఏదో గిరగిరా తిరుగుతోంది. కళ్లు తిరుగుతున్నాయి. చేతిలో సంచి వేళ్ళకు అంటుకు పోతోంది. క్యూ ముందుకు జరుగుతోంది. తిరుపతి

వేంకటేశ్వరస్వామివారి దర్శనంకోసం క్యూలో నిలబడ్డ భక్తుడికి గర్భగుడి ప్రవేశం దొరికినట్లయింది సత్యానికి షాపు మెట్లు కాలికిందకు రాగానే.

"ధన్" మని మెట్లమీద విరుచుకు పడిపోయాడు. తను కాదు పడింది—తన ముందున్న ముసలాయనలాగ కనిపించే వయసాయన—మెట్లమీద బోర్లా పడ్డాడు.

"కళ్ళు తిరిగి వుంటాయి. నీళ్ళు పట్టుకరండి."

"ఎండ! ఎండ! వడగొట్టి పడిపోయి వుంటాడు."

"రెండు రోజులుగా తిండి లేదట."

ఎవరికి తోచినట్టు వాళ్ళు మాట్లాడుతున్నారు. సత్యం కొయ్యబారిపోయి చూస్తున్నాడు.

క్యూలో నుంచి కేకలూ అరుపులూ! క్యూ చెదిరింది. సందు దొరికిందే చాలని షాపువాడు గబ గబా తలుపులు వేసుకుంటున్నాడు. జనంలోనుంచి కేకలు.

"రాస్కెల్! షాపు మూసేస్తున్నాడు."

'తలుపులు బద్దలు కొట్టండి'

జనం విరగదొక్కు కుంటున్నారు. షాపువాళ్ళు పోలీసులకోసం కేకలు పెడుతున్నారు.

'పోలీసులు ! పోలీసులు వస్తున్నారు.' జనం తోపిడిలో పడిపోయాడు సత్యం.

సత్యానికి ఏం జరుగుతుందో కూడా తెలియటంలేదు. అటూ ఇటూ తోస్తున్న జనం వత్తిడికి నలిగిపోతున్నాడు. ఇంతలో ఓ పోలీసు లాఠి గాలిలోకి రివ్వున లేచి, ఒకడి వీపుమీద వాలిపోయింది. జనంలోనుంచి, 'అమ్మో' 'బాబో' అని కేకలు. అడ్డంవున్న వాళ్ళను విరగదోచుకుంటూ బలం గలవారు బయటు పడుతున్నారు.

ఇంతలో పోలీసు లాఠి ఒకటి సత్యం డొక్కలో బలంగా పొడుచుకుంది.

'అమ్మో' అంటూ గావు కేకతో పడిపోయాడు సత్యనారాయణ. జనంలోనుంచి కేకలూ పరుగులు.

( 1965 )